కథానిక

# పీర్ల పండగ

-శ్రీమతి పి. సంజీవమ్మ

అనంతపురం జిల్లాలో అదొక పెద్ద గ్రామం. ఆ దినం పీర్ల పండగ. పండగ సంబరం జోరుగ సాగుతోంది. ఊరంతా వుత్సాహంతో వూగిపోతోంది. ఇంత వుత్సాహం ఉగాదినాడైనా ఈ వూర్లో చూడలేం. చుట్టుపక్క పల్లెల జనం ఈ పండగ రెన్నాళ్ళు ఇక్కడే మకాం. ప్రతి ఇల్లు చుట్టపక్కాలతో నిండివుంటుంది. పది పదిహేను ఇళ్ళు వుంటే ఎక్కువ ముస్లింలవి ఆ వూర్లో. ఆ పండగ సంబరమంతా ముఖ్యంగా హిందువులదే. చూచేవాళ్ళకు ఈ పండగ హిందువులదా, ముస్లింలదా అన్న ఆశ్చర్యం కలక్కపోదు. 'మొహరం' అనే మాట చాలామందికి తెలీదు. 'పీర్ల పండగ' అనేదే ఈ జనం వాడుక.

పండగ రెండు దినాలు జరుగుతుంది. మొదటి దినం గుండానికి మాండ్లు తోలే కార్యక్రమం పెద్ద వేడుక. ఒక్కొక్క తోట రైతు పోటీపడి పెద్ద పెద్ద మాండ్లు తోలుతాడు. వాటిని ఈడ్వటానికి ఎన్నాళ్ళనుండో మాంచి ఎద్దుల్ని ప్రత్యేకంగా మేపుతారు. మాండ్లను ఈడ్పించేనాడు శ్రద్ధగ అలంకరిస్తారు. ఈడ్చేటప్పుడు ఒకటే కేకలతో తప్పెట్ల శబ్దాలతో పౌరుషాన్ని పోస్తుంటారు వాటికి.. ఎవరి ఎద్దు ఎలా పరాక్రమాన్ని ప్రదర్శించిందో పండగపోయిన చాల నాళ్ళవరకు మురిపెంతో చెప్పుకుంటూ వుంటారు.

'పక్కీర్లు' అయి పీర్ల స్వాములకు మొక్కుబళ్ళు చెల్లించుకోవటం. సాయంకాలం ఊరంతా గుంపుగ పానకాలు చదివించేందుకు మసీదుకు బయల్దేరటం చూచితీరాల్సిన దృశ్యాలు. అందులోనూ 'మాదిగగేరి పానకాలు ఎల్లటం' మరొక ప్రత్యేకత. ఇదంతా అర్ధరాత్రి వరకు సాగుతుంది. తరువాత పీర్ల స్వాముల మెరవన (వూరేగింపు). అందులో 'సాహుసేన్' ఆడటం గురించి చెప్పుకోక తప్పదు. మొదటి వరుసలో ముసలి వాళ్ళు నలుగురు నలుగురుగ ఒక్కొక్క జట్టు తయారై చేతులు కలిపి మహా నిండుగ హుందాగా భక్తితో లయబద్ధంగ అడుగులువేస్తూ 'సాహుసేన్' ఆడుతూ వుంటే ఆదేపనిగ చూస్తారు జనమంతా. చాల ముచ్చటగ వుండే దృశ్యం. ఇక వూరేగింపు పొడవునా పడుచు కుర్ర వాళ్ళు 'సాహుసేన్. సాహుసేన్' అంటూ తొక్కే చిందులు వేసే గంతులు కేకలు రక్తాన్ని ఉడుకెత్తిస్తాయి. పదిపది గుండ్రంగ చేతులు కలిపి - నిలిచి, మధ్యలో ఒక మాదిగవాన్ని నిలబెట్టి తప్పెట వాయింపమంటారు. తప్పెట జోరు ఎక్కువో చిందులు తొక్కేవాళ్ళ వేగం ఎక్కువో చూచేవాళ్ళు పోల్చుకో

లేరు. ఒక్కొక్కసారి ఆడేవాళ్ళే తప్పెట లాక్కొని మోగించి వేయడమూ కద్దు ఆవేశంలో. శివమెత్తినట్లుండే దృశ్యం అంతా. మనుషులు ఇంత మహోత్సాహంగ కూడ వుండగలరా అని ఆశ్చర్యం వేస్తుంది. ఈ సమయాల్లో మాదిగ వాళ్ళకూ, ఇతరులకూ ఏ అంటరానితనమూ అడ్డురాదు. అంతా రాసుకుంటూ పూసుకుంటూ ఎగురుతారు. గంతులేస్తారు. ఇదంతా చూస్తుంటే ఈ మనుష్యులేనా కులాలని, మతాలని కృత్రిమంగా అడ్డుగోడలు పేర్చుకొన్నది అన్న సత్యం స్ఫురణకు రాకమానదు. కృత్రిమంగా పేర్చబడ్డవే కనుక ఒకనాడు కూలిపోక తప్పదన్న సంగతీ ఇంగితానికి వస్తుంది. ఊరందరూ తమదిగ చేసుకుంటూన్న ఈ పండగను తిలకించిన ఏ మానవున్ని అయినా 'ఈ హిందువులు ఈ ముస్లింలేనా మతకలహాల పేరుతో తలలు తరుక్కుంటూన్నది' అన్న సందేహం పీడించక మానదు.

మొదటిదినం నాటి ఈ సంబరమంతా ఒక ఎత్తు; మరుసటి దినం పీర్లు ఏటికి పోయే దినం—సోమప్ప మండే గుండంలో దూకి నిక్షేపంగ బయటికి దాటుకొని వచ్చే దృశ్యం ఒక ఎత్తు. ఆ మహత్తు చూడటానికి జనమంతా విరగబడతారు ఆనాడు. ఆ జనానికి దేవుని 'సత్యం' మీద వున్న గురికి తిరుగులేదు.

సోమప్ప అంటే ఆవూర్లోనే కాదు చుట్టుపక్క పదామడ దూరంలో వున్న వూర్లదాక తెలియని జనంలేరు. సోమప్పకు నడివయసులోనే పెళ్ళాం పోయింది. నా అని చెప్పుకో తగ్గ వాళ్ళులేరు. పెళ్ళాం పోయిన నాటి నుండి అతని తత్వమే మారి పోయిందంటారు, 'కుళ్ళాయిస్వామి'కి భక్తుడయినాడు. అప్పుడు స్వామి పూనకం వస్తుంటాడు. చూడడానికి కాస్త బలహీనుడే అనిపించినా చాల సాహసవంతుడంటారు. ఆరు పదులు దాటిన వయసు ఇప్పుడతనిది. ఏడెనిమిది సంవత్సరాల నుండి గుండంలో దూకుతూ స్వామి మహత్తు చూపుతున్నాడు. ఈ విశేషం జిల్లా అంతా పాకింది.

* * *

ఆనాడు గుండానికి మాండ్లుతోలే దినం. బ్బాటపొదవునా మాండ్లు తోలుకొచ్చి విడిచినారు. రాత్రిలోగా అవన్నీ గుండం చేరాలి. మధ్యాహ్నం కాసేపు ఎద్దులకు విశ్రాంతి. పెద్దరుగు దగ్గర పదిమంది కలిసి పిచ్చాపాటి మాట్లాడుతున్నారు పెద్దన్న చిన్న రైతు. ఫకురుద్దీన్, రాములు రైతు కూలీలు, ముగ్గురి 'ద్రసూ్ప' ఒకరకమే పండగ కదా కొత్త లాంగ్లాత్ అంగీలు తొడుక్కొన్నారు, సైను పంచలు కట్టుకున్నారు. పెద్దన్నా రాములూ అప్పుడే ఒక్కొక్కడు రెండు కంచాల పరమాన్నం 'ఫుల్లాగా' పట్టించి వచ్చినారు. ఫకురుద్దీన్ ఉపవాసం— పీర్లకు పానకాలు చదివింపులు కావాల మరి.

పెద్దన్న : అనంతపురం నుండి నాలుగు రిజర్ పోలీసు వ్యాన్లు పోయినాయంటప్పా అదోనికి నిన్న ఈ నామాళ్ళకు ఏమొచ్చిందో కొట్లాడి సచ్చేకి, మనకి తెల్దప్పా.

ఫకురుద్దీన్ : అవునన్నా! నేనూ ఋంటి. మొన్న సిన్నపరెడ్డన్న ఈడ పేపరు సదువుతా వుండి సెప్పినాడు— ఆదోన్లో సాయిబులూ హిందువులూ అంటని జాస్తి కొట్లాడు కొంటున్నారంట.

రాములు : అవ్ అది యాడో 'ఆలీగడ్డ' సీమంట. పెద్దన్నా అడగూడ ఇదే కతంట తలకాయలు నరుక్కుంటుండారంట. నీమతమూ నా మతమూ అంటని ఈ పక్క మనూర్లలో యానాడు కొట్లాడుకోంగా సూల్లెదప్పా మనతాతల కాలం నుండీ.

ఫకురుద్దీన్ : మనకి కొట్లాట ఏంటి కొత్తా దన్నా. నువ్వు కష్టం జేసిన సొమ్ము నేను పీక్కోలేదు, నా సొమ్ము నువ్వు పీక్కోలేదు. ఎవుని కష్టం వాడు తినేదానికి కొట్లాట ఏంటి కొస్తాది.

పెద్దన్నా : రైట్ గ చెప్పినావు ఫకురుద్దీనూ: మనం పన్జెయ్యక పోతే మరి మన మతాలేమైనా బువ్వపెడతాయా నాకు తెలీక అడుగుతాగాని— దీండ్ల కోసంకొట్లాడు కొంటూ కూసుండేకి. ఏందో పెద్దోళ్ళు సేసి పోయినారు మతమంటనీ దేవుడంటనీ. పండగ పబ్బమూ వొస్తే కలిగింది ఇంత వొండు కుంటాం స్వామీ రామా అనుకోని తింటాము ఈ కాడికల్లా. నీ దేవుడు జేసేదేముంది నాదేవుడు జేసేదేముందోయ్.

ఫకురుద్దీన్ : అంతేగదన్నామరి ఈ పొద్దు మాత్రం మాపండగంతా మీదే నన్నో!

రాములు : ఏందోయ్ మాపండగే మీ పండగ అంటని ఈ పొద్దు కొత్తగా మాట్లాడు తుండావూ.

ఫకురుద్దీన్ : ఆయ్. తమాషాకి అంటిలే రామన్నా! ఈ యేడు గుండానికి మాండ్లు కానా పడతా వుండాయన్నా. సందకాడ అట్లా పిల్లొల్లని గుంపేసుకొని గుండంకాడ మాండ్లు బిరబిర కొట్టేపించండన్నా. లేకపోతే రేపియ్యాలకు ఈ మాండ్లన్నీ పూరా కాలిపోవల్లంటే అయ్యేట్లేవు.

పెద్దన్న : ఈ పని నువ్వు మాకు చెప్పేది వుందా ఫకురుద్దీనూ. మా పని అంటావా, నీ పని అంటావా. మామా పిల్లోన్ని పొద్దున్నే అంపించి పడిండ్లలో పది గొడ్డెండ్లు తెప్పిచ్చి పెట్నానప్పా. మాండ్లు గుండం కాకి వచ్చేతలికి మేము ఆడ రడీగ వుండమా? అని 'రేపు సోమప్ప మామ గుండం దిగే కత ఏంజేత్తాదో ఏమో' అంటూ గొణుక్కుంటూ వెళ్ళిపోయినాడు.

'అన్ని మతాలు సమానం – దేవుడొక్కడే' అన్న నీతి బోధలు ఈ పాటక జనానికి తెలియవు. వాళ్ళ వాస్తవ జీవితమే వాళ్ళకు ఒద్దికగా బ్రతికేది నేర్పింది. మత కలహాల వెనుక వుండే స్వార్ధాల గురించి యోచించే పరిజ్ఞానం వాళ్ళకు లేదు. వాళ్ళకున్న విచక్షణా జ్ఞానం పరిధిలోనే విశ్లేషించుకున్నారు వాళ్ళు. వాళ్ళ జీవితాల్లో మతం సంగతి గుర్తొచ్చే సందర్భాలు చాల తక్కువ. అవీ కేవలం మిథ్యాచారాలు పాటించటానికే. అంతకంటె అవసరం వారికుండదు.

*　　　*　　　*

రాత్రి నడి గుండం కణకణ మండుతూంది. అంత పెద్ద గుండం ఆ జిల్లాలోనే ఎక్కడా లేదంటారు చూచిన వాళ్ళు గాలికి చుట్టుపక్కల వున్న ఇళ్ళ మీదికి నిప్పు రవ్వలు ఎగిసి పడుతున్నాయి. గుండం చుట్టూ నాలుగ్గజాల దూరంవరకు మనుషులు నిలబడలేక పోతున్నారు ఆ శాకానికి (వేడికి) ఇంకా కాలవలసిన మొద్దులు చాలానే వున్నాయి గుండంలో. మధ్యాహ్నం దాటింది. మూడు గంటలనుండి పీర్లు ఊరేగింపుతో ఏటికి పోవాల. జనమంతా వూరేగింపు చూడటానికి అప్పుడే మిద్దెలెక్కి కూచున్నారు. చుట్టు పల్లెలనుండి వచ్చిన జనం ఎక్కువ భాగం పీర్ల మసీదు ప్రాంతాల్లో నిండిపోయి వున్నారు. ఊరేగింపులో పీర్లను ఎత్తుకొని మోయవలసిన వాళ్ళు వుపవాసం వుండి బావిలో మునిగి రావటానికి పరుగెత్తుతున్నారు. ఒకటే కోలాహలం.

సోమప్పను స్వామి పూనినాడు. పరుగు తీసినాడు బావిలో మునిగి రావటానికి. పెద్ద గుంపు పరుగెత్తింది అతని వెంట రెండు ఫర్లాంగుల దూరం బావిదాకా. పిల్లలకైతే చెప్పలేనంత కుతూహలం సోమప్పకంటే ముందు వాళ్ళే బావికి దౌడుతీసినారు. బావిలో దూకింది తడవు, తిరిగి పరుగు తీశాడు సోమప్ప మసీదు వైపు. నేరుగా పీర్లస్వాముల్ని చేరుకోవాలంటే గుండం దాటాల. ఎక్కుతున్న జనమూ అంతా అతనికంటే ముందే పరుగు 'గుండంవద్దకు. సోమప్ప పరుగుతో ఎప్పుడు దూకినాడో చెప్ప పాటులో — నడిగుండంలో నిప్పులమీద అంగలు వేస్తున్నాడు- ఇంక రెండు అంగలు వేస్తే అవతలిగట్టు - కాబోతూ వున్న రాక్షసి మొద్దు ఒక అడుగును అడ్డుకుంది. రెండో అడుగులో బోర్లా పడిపోయిన సోమప్ప రెప్పపాటు లేకుండా నిలిచిపోయిన జనం- ఒక్క పెట్టున హాహా కారం - ఏం చేయాలో తోచని ఒక్కక్షణం- మరుక్షణం ఒక అడుగు వంగి పదిచేతులు సోమప్పను బయటికి లాగినాయి- మూగినజనం- వుడికిపోతున్న దేహం-దాహం అందించినారు. మెల్లగ మసీదులోనికి చేర్చినారు. స్వాముల పాదాలదగ్గర. మల్లా ప్రార్థన చేసినారు. కొందరు పరుగెత్తి ఆంజనేయస్వామికి టెంకాయలు కొట్టి వచ్చినారు. అరిటాకుల్లో చుట్టి సోమప్పను ఇంటికి చేర్చినారు. హెల్త్ సెంటర్ డాక్టరు వచ్చినాడు. వొళ్ళంతా అప్పటికే బొబ్బలెత్తింది. స్పృహలో లేని సోమప్పకు ఇంకా మంటలు తెలియలేదు. వూరిజనం అంతా ఆత్మీయులే అయినారు సోమప్పకు. సేవకు. వైద్యానికి లోటు జరగలేదు.

పీర్ల స్వాముల్ని ఏటికి వెళ్ళ కుండ ఆ పడానికి లేదు. జనానికి వుత్సాహం సగం చచ్చింది. యథావిధిగానే కార్యం ముగిసింది.

తెల్లవారేసరికి సోమప్పకు బాగ స్మరణ కలిగింది. మంటలకు తట్టుకోలేక పోతున్నాడు అమానవుడు' వొళ్ళంతా నవనీతం పూసినారు. అరిటాకుల్తో కప్పినారు. డాక్టరు తన ప్రయత్నాలన్నీ చేస్తున్నాడు. మూన్నా

ళ్ళు ఆ జీవి ఆర్తనాదం ఆపలేదు. వూర్లో కంట తడిపెట్టని ప్రాణి లేదు. నాలుగోనాటికి వాళ్ళు మంటల గురించిన స్పృహ జారి పోతూంది సోమప్పకు. మూలుగు మొదలయింది. చుట్టూ వున్నవాళ్ళు పలకరించటానికి ప్రయత్నం చేస్తున్నారు. అతని నోరు పెకలించుకొని రెండుమాటలు వచ్చి ఆగినాయి— 'స్వామి సల్లగా సూడాల అయితే ..' కొరవ మాటలు స్వామికే వినిపించేందుకువెళ్ళిపోయినాడుసోమప్ప.

"ఒరే దేవునికి ఎంత కనికరం లేక పోయిందిరా" ఒక ముసలి గొంతు వాపోయింది.

"దేవుడు చేసేదేముంది పెద్దయ్యా, వయసు కండలు కలిగి నన్నాళ్ళు దుంకి బయటికి ఈదినాడు. బాగ దళిలి పోయినాడు మనిషి. పోయిన ఏడు బయట పడేదే కష్టమై పోయింది. ఈ యేడన్నా ఇంక గుండంలో దూకేది మానుకో మామా అంటే నామాట ఇన్లేదు..." పెద్దగొంతు

'ఆయుస్సు తీరింది. ఆస్వామే పిలుపుకు పోయినాడప్పా తనతావుకి. ఆయన మహాత్యానికి మనం ఎదురు సెప్పే వాళ్ళమా........' ఒక ముసలవ్వ.

స్వామి మహత్తును గురించి ఆలోచనలో పడినాడు పెద్దన్న.

(వాస్తవ ఘటన ఆధారంగా)

మినీకథ :

# ఇద్దరూ ఇద్దరే

మల్లాది వెంకటకృష్ణమూర్తి

శేషసాయిని, ఆమె స్నేహితురాలు మాట్లాడుకుంటున్నారు. శేషసాయి భర్త అఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి తన భార్యని చూసి కొద్దిగా కోపంగా తిట్టాడు ఆమె భర్త నెమ్మదిగా.

అఫీసులో అలసిపోయి నేనింటికొచ్చే సరికి జిడ్డు కారుతున్న మొహంతో మాసిన బట్టలతో ఏమిటీ అవతారం? కాస్తంత శుభ్రంగా వుండలేవూ?"

ఆ మాటలు శేషసాయి స్నేహితురాలి చెవిన పడనే పడ్డాయి. పక్కవాటాలోనే అద్దెకు వుంటోంది ఆ అమ్మాయి. ఆ అమ్మాయికి కొత్తగా పెళ్ళయింది. వెంటనే తన వాటాలోకి వెళ్ళి గబ గబా మొహం కడుక్కుని, పౌడర్ రాసుకుని ఇస్త్రీ చీర కట్టుకుని, పువ్వులు పెట్టుకుని భర్త రాకకోసం ఎదురు చూడసాగింది: ఆయన వచ్చాడు. షోకు చేసుకొని వున్న తన భార్యని చూసి అడిగాడు విసుగ్గా. "ఎక్కడికీ బయలుదేరావు?"